కుమారి నందుల సుశీలాదేవి

ఉదయం ఎనిమిది గంటలవుతుంది. ఆవూరి నీలాటిరేవంతా అమ్మలక్కలతో నిండివుంది. ఆవేళకి అక్కడకు రోజూ రకరకాలైన స్త్రీలు చేరతారు. అత్తలు, కోడళ్ళు, పెళ్ళియినవాళ్ళు, కన్యలు, బిడ్డతల్లులు ఆ ఊరి సమస్త స్త్రీజనం ఆ సమయాని కక్కడే వుంటారు. అక్కడవున్న ఇసుకతో బిందెలు పరపరా తోముతూ రచ్చబండ తగాదా దగ్గిర్నించి, చాకలి వీరమ్మ కూతురి శీలంవరకూ చర్చలు జరుపుతూవుంటారు ఆ గ్రామీణ భామినులు.

"ఏమే! కోడలుపిల్లా! కొంచెం నిదానించు మరి. పెద్దదాన్నికదా అట్లా తోసుకుపోతావేం?" అంటూ జారిన ధవళిముకుటాన్ని సరిచేసుకొంటూంది ఓక పూర్వసువాసిని.

"ఏవమ్మో! సీతా! మీ వదిన ఇక కాపరానికి రాదేమిటి?" అని ఓ పడుచుపిల్లను ప్రశ్నించిందో నడివయస్సావిడ.

"ఈ మాఘమి వెళ్ళాక వస్తుంది. అది సరే కాని మీ రెండో అమ్మాయిని కొన్నుకి మీ యింటికి పంపనన్నారటగా ఆమె అత్తారు! పాపం తొలిసారి కూడాను!" అని ఎదురుదెబ్బతీసిందా పల్లెపడుచు.

"ఈ కాలపు ఆడపిల్లలకు సమాధానం చెప్పలేం తల్లీ" అంటూ మూతివిరుచుకొందా నడికారుభామ.

ఇంతలో ఆ రేవులోకి ఒకమ్మాయి తల వంచుకొని, బిందె పట్టుకొని వచ్చింది. సన్నగా, తెల్లగా, పొడవుగా, చూపరులను నిలబెట్టే సౌందర్యమామెది. కట్టుకొన్నది ముతకచీరైనా పొందికగా కట్టుకొన్నది. ఆ అమ్మాయిరాకతో అమ్మలక్కల నోళ్లన్నీ కట్టుబడ్డాయి. అందరి దృష్టీ ఆమెమీద కేంద్రీకృతమైంది. ఆమె ఒక కాలు కొంచెము ఈడుస్తున్నది. నెమ్మదిగా మెట్లు దిగి బిందె నీటిలో ముంచింది. ఇంతవరకూ వాదనచేస్తున్న పిల్ల ఆ అమ్మాయని సమీపించింది.

"ఏమే! పార్వతీ! ఎక్కడా కనిపించడం లేదు? నాన్న వంట్లో కులాసాయేనా? పాపాయిని చూద్దుగాని మా ఇంటి కోమారు రావే!"

పార్వతి మెల్లగా నవ్వింది: "నాన్నకి వంట్లో బాగుండలేదు సీతా! పనితో తెమల్లం లేదు. మీ అత్తారింట్లో అంతా కులాసాయేనా?" అంది పార్వతి.

పార్వతిరాకతో అక్కడ గుసగుసలు ఎక్కువయాయి. ఓ ఇల్లాలు కొంచెం నిమ్మదిగా "మాణిక్యమంటిపిల్ల! ఆ కాలు వంకర లేకపోతే పార్వతికి సాక్షాత్తూ పార్వతేసాటి. ఆ పిల్ల దౌర్భాగ్యం కాకపోతే ఆ గర్భ శ్రీమంతులింట బుట్టి చివరికీ గతిపట్టింది!" అని తన పక్కావిడతో గొణికింది. కొందరు పార్వతిని చూసి తమలో తాము నవ్వుకొంటున్నారు. పార్వతి ఇవేమీ పట్టించుకోకుండా తన మానాన తాను వెళ్ళిపోయింది.

పార్వతితండ్రి రంగయ్య ఒకప్పుడు గొప్పగా బతికిన మోతుబరి. ఆ గ్రామంలో రంగయ్య ప్రభ ఓదశ వెలిగిపోయింది. కాలక్రమేణా ఆస్తులు హరించి పోయాయి. రంగయ్య భార్య నరసమ్మ పార్వతి పుట్టిన ఏణ్ణర్థానికి పసుపుకుంకుమలతో, బిడ్డను, భర్తను విడిచి పరలోకానికి వెళ్ళిపోయింది. రంగయ్య భార్య మరణంతో పసిపాప అయిపోయాడు. ఆ సమయానికే ఆస్తిమీద దావాలు మంచి పట్టులో ఉన్నై. భార్య మరణంతో విరక్తుడైన రంగయ్య దావాల మీద ఆసక్తి చూపలేదు. చివరకు రంగయ్య ఓ పాత పెంకుటిల్లుతో తిండికి మాత్రం సరిపడే కొంచెం భూమితో మిగిలాడు. కష్టాలనేవి రాకుండా ఉండాలేకాని, రావడం మొదలెడితే వాటి విశృంఖల విహారానికి హద్దుండదు.

బంగారు బొమ్మలాంటి పార్వతిని చూసుకొని రంగయ్య బతుకుతున్నాడు. పార్వతి ఎనిమిదేళ్ల పిల్లగా వుండగా ఓ రోజు పార్వతి నేస్తాలతో ఆడుకొంటోంది. ఆటల్లో కరణంగారి రామం పార్వతిని చెట్టుమీద నుంచి తోశేడు. పార్వతికాలు వంకర తిరిగిపోయింది. రంగయ్య నెత్తీ నోరూ కొట్టుకుంటూ పట్నం తీసికెళ్ళాడు, కూతుర్ని. డాక్టరు కనీసం అయిదారు వందలు లేనిదే తానేమీ చెయ్యలేనన్నాడు. రంగయ్య అభిమానం వదిలి కరణాన్ని ప్రాధేయపడ్డాడు. రంగయ్య ప్రాపుతో ఇలుకట్టిన కరణం రంగయ్య కోర్కను తీర్చలేదు. అంతే కాకుండా రంగయ్యకి తన పలుకుబడితో అప్పు పుట్టకుండా చేశాడు. పార్వతి కాలు బాగవలేదు. పార్వతి పెరిగి పెద్దదయింది. కాలులో లోపంవినా పార్వతి ఆ వూరి కన్నెపిల్లల్లో పుత్తడి బొమ్మ!

పార్వతి నీలాటిరేవునుంచి బిందతో ఇంట్లో ప్రవేశించింది. బిందదించి వంటింట్లోకి వెళ్ళింది.

"అమ్మా! పారూ! తల్లీ ఇల్లారా" అని సన్నగా మూలిగాడు తండ్రి.

కొంగుతో చెయ్యి తుడుచుకొంటూ పార్వతి వచ్చింది.

"చూడమ్మా! నా కఱ్ఱ ఇలాగియ్యి. ఆ వెంకయ్య ఏదో సంబంధం చెప్పాడు కనుక్కొస్తా!" అన్నాడు రంగయ్య మంచం మీదనుంచి లేస్తూ.

"అదేంటి నాన్నా! వంట్లో జ్వరంతో నువ్వెట్లా వెడతావు?"

"వెర్రితల్లీ! ఈ జ్వరం తగ్గేదికాదు. నిన్నో ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరుతుంది" అంటూ వీధిలోకి వెళ్లాడు.

పార్వతి శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. తండ్రిశరీరం నానాటికీ శిథిలమవుతోంది. తనకు ఈడు మీరిపోతోంది. తన ఈడు పిల్లలు సీత, జానకి వాళ్లంతా కాపరాలు చేసుకొంటున్నారు. తండ్రికి పెళ్ళిచేసే స్తోమతులేదు. ఏ సంబంధమయినా మూడు వేలు నాలువేలు అడుగుతారు. తనకాలు సంగతి తెలిస్తే మరీ తాడెక్కిపోతారు. తండ్రికి డబ్బు ఎక్కడనుంచి వస్తుంది? ఈ కాలంలో కాలి అవకరంతో తనని డబ్బులేకుండా కట్టుకొనే వాడెవడు? ఈ రోజుల్లో గడ్డిబొమ్మకి బట్టలు వేసి పిల్లనిస్తానంటే కట్నం అని గుడ్లప్పజేస్తుంది. ఇక తనబోటి దానిగతి? పోనీ పెళ్ళిచేసుకోపోనే! కాని ఇది పల్లెటూరి సమాజము. తనకి పదిహేడేళ్లు వచ్చినవనే నానామాటలు అంటున్నారు. ఇంక బ్రహ్మచారిణిగా ఉంటే బ్రతకనిస్తుందా? ఇంతకీ తనకాలే కారణం! కాలు ఎవరివల్ల వంకరయిందో ఆ వ్యక్తి పార్వతి మనోవీధిలో మెరిశాడు. తన కాలుని వంకర చేసినా అతనికేం? నిక్షేపంలా పట్నంవెళ్ళి డాక్టరు పరీక్ష పాసయివచ్చాడు. శ్రేష్ఠో రేపో ధనపు బిందెలతో ఉన్న అమ్మాయిని



కట్టుకొంటాడు. కాని అతని తండ్రి తన కౌలు బాగుకి ఓ అయిదు వందలు ఇవ్వలేక పోయాడు. పార్వతి కళ్లవెంట జలజలా నీళ్లు కారాయి. అంతలో తండ్రి పిలుపు వినబడింది. పార్వతి కళ్ళు తుడుచుకొని తలుపు తీసింది. తండ్రి నీరసంగా వచ్చి మంచంలో కూలబడ్డాడు. అతని మొహంచూసి పార్వతి వెళ్ళిన పని సఫలమవలేదని గ్రహించుకొంది. వంటింట్లోకివెళ్ళి జావతీసుకొని వచ్చి తండ్రికిచ్చింది. తండ్రి మెదలకుండా తాగి పడుకొన్నాడు. పార్వతి నిట్టూర్చింది. పని చూసుకొనేటందుకు పెరట్లోకి వెళ్ళిపోయింది.

సాయంకాలమయింది. రంగయ్య పార్వతిని పిల్చాడు.

"చూడమ్మా! మన రైతు పెద్దయ్య క్రింద సేదు కిస్తు బకాయిపడ్డాడు. ఈ ఏడు ఇవ్వలేదు. ఆ కాస్త చెక్కా అమ్మితే ఓ రెండు వేలొస్తాయి. ఈ ఇల్లు కలిపితే రెండు వేల యిదువంద లవుతాయి. ఆ వెంకయ్య అడిగిన మొత్తం సరిపోతుంది. ఓసారి మాట్లాడాలని పెద్దయ్యను పిలుతల్లీ!" అన్నాడు.

పార్వతి నిర్విణ్ణురాలయింది. "అదేంటి నాన్నా! ఇల్లూ, భూమి అమ్మి నన్నొదిలించుకొంటే తర్వాత నువ్వే మవుతావు నాన్నా? పెళ్ళి వద్దు ఏం వద్దు! నన్ను నీవద్దనే వుండనీ నాన్నా!" అంటూ కన్నీళ్ళు తుడుచుకొంది పార్వతి.

"నేనన్నీ ఆలోచించానమ్మా! ఇంక గత్యంతరం లేదు. నువ్వెళ్ళి త్వరగా పెద్దయ్యను రమ్మను. పొద్దుపోతోంది. దబ్బున వెళ్లు తల్లీ" అని అటువైపు తిరిగి పండుకొన్నాడు రంగయ్య.

పార్వతి లేచి తలుపు దగ్గరగా వేసి పమిటతో వళ్ళంతా కప్పుకొని, తల వంచుకొని గబగబా నడుస్తూ పొలానికెళ్ళింది. తనెళ్ళే సరికి పెద్దయ్య పొలంలోనే వున్నాడు. పార్వతిని దూరాన్నుంచే చూసి "చిన్న దొరసానమ్మ వచ్చిందే" అన్నాడు.

పార్వతి: "పెద్దయ్యా! నాన్న వంటో బాగుండలేదు. నిన్నోసారి సాయంకాలం రమ్మన్నాడు" అంది ఆవు దూడను నిమురుతూ.

"అట్టాగేనమ్మా. సాయంగా నువ్వే రావాలా పార్వతమ్మా? కాకితో కబురం పితే నేరానా? నువెళ్ళు తల్లీ. చీకటడితే పురుగుపుట్ర ఉంటవి" అన్నాడు పార్వతిని వాత్సల్యంగా చూస్తూ.

పార్వతి వెనక్కు మళ్ళింది. సూర్యాస్తమయం అయేలాగుందని త్వరగానడుస్తూ చెరువు గట్టువద్దకు వచ్చింది. గట్టున ఎవరో పట్నవాసి కూర్చొని చదువుకొంటున్నాడు. ఆ ఆగంతుకుడు అడుగుల చప్పుడు విని వెనుదిరిగి నిలిచి "పార్వతీ!" అన్నాడు.

పార్వతి వెనుదిరిగి, నిలచి ఆ నూతన వ్యక్తిని చూసింది.

ఆ వ్యక్తి పార్వతిని సమీపించి "పారూ! గుర్తులేదా? పలకరించినా పలకడం లేదేం?" అన్నాడు.

పార్వతి మాటలకోసం తడుముకుంటూ: రా...మం..." అంది.

"అవును రామాన్నే పార్వతీ! నేనువచ్చినప్పటినుండి నిన్నూ మీ నాన్నని చూద్దామంటే తీరిక చిక్క లేదు." అన్నాడు రామం.

పార్వతి తలవంచుకొని కాలి బొటన వేలితో నేలని రాస్తూ "చాలా పెద్దవాడివయ్యాక మేం గుర్తుంటామా?" అని నాలుక కరచుకొని "వెళ్ళొస్తా రామం. ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేదు" అంది.

"నిన్ను ఇంటివరకూ దిగబెట్టనా! పార్వతీ!"

"ఆమాత్రం దయవుంటే చాలు. నేనొక

# ★ పార్వతి ★

రైనా పోగలను." అంటూ వెళ్ళిపోయింది పార్వతి.

మర్నాడు కరణం మనిషి రంగయ్యకోసం వచ్చి బాకీ పైసలా చేయమన్నారు అని కబురు చెప్పాడు. రంగయ్య నిర్విణ్ణుడయ్యాడు. నెమ్మదిగా వచ్చిన మనిషితో "నే నొస్తున్నానని మీ దొరతో చెప్పు!" అన్నాడు.

రంగయ్య వెళ్ళేసరికి కరణం కచేరీ సావడిలో కూర్చుని రైతులతో యిష్టాగోష్ఠి జరుపుతున్నాడు.

రంగయ్యను చూసి "ఓ! రంగయ్య బావ సాయానా వచ్చాడే, కాకితో కబురంపితే నే రానా బావా!" అన్నాడు వికటంగా నవ్వుతూ.

రంగయ్య అరుగుమీద కూలబడుతూ "ఆ కూర్చున్నది ఎవరూ..." అన్నాడు చత్వారం కళ్ళు చికిలిస్తూ.

"నేను మావయ్యా రామాన్ని—" అని కాళ్లకు నమస్కరించాడు రామం.

"వెయ్యేళ్లు వర్ధిల్లునాయనా!" అని దీవించి కరణంకేసి తిరిగి! "ఎందుకు కబురెట్టావు కామయ్యబావా!" అన్నాడు.

"ఆ! నీకు తెలియందేముంది? మావాణ్ణి ఈ వేసంగుల్లో ఓ యింటివాడిని చేద్దామనుకొంటున్నా. దేనికేనా డబ్బు కావాలికదు. ఏదో! నీ బాకీ కాస్త నా మొహాన కొడితే నీ ధర్మమా అని మావాడి అక్కర తీరిపోతుంది" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"అదేంటి? కామయ్యా అటాగంటావు? నా సంగతి నీకు తెలీదా? ఓ నాలుగురాళ్లు పోగడితే పార్వతిని విరగడ చేసుకొందామనుకొంటున్నా. దానీడు వాళ్ళంతా చల్లంగా కాపరాలు చేసికొంటున్నారు. దానిగతే అట్టా కాలింది. నా బొమ్మ మీద కుంపటిదించుకొంటే నాకీ భూమ్మీద పనేముంది కామయ్యబావా" అంటూ కళ్లు తుడుచుకొన్నాడు రంగయ్య.

అక్కడే కూర్చొనివున్న రామం కంట్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అతనికి బాల్యమంతా మనసులో గిర్రున తిరిగింది. తన చిన్నతనంలో రంగయ్యభార్య సూరమ్మ వెండిగిన్నెలో పెరుగన్నం కలిపి పార్వతికి, తనకూ తినిపించటం, అప్పటి రంగయ్య వైభవం, దరిమిలా రంగయ్య దివాళా, సూరమ్మ మరణం, తాను పార్వతిని చెట్టు మీదనుండి తొయ్యడం పార్వతి కుంటిదవడం అన్నీ గిరగిరా తిరిగాయి.

కరణం కాసేపూరుకొని "అల్లాగంటే ఎల్లామరి రంగయ్యా! వెధవ సంసారంలో అన్నీ ఝుంఝూటాలే. నీకు పార్వతి పెళ్లెంత ముఖ్యమో నాకు రామం పెళ్లంత ముఖ్యం కదా. ఏదో మరి ఆ కాస్త లెక్క నా మొహాన కొట్టేవా! నిన్ను మళ్ళా ఏమన్నా అంటే చెప్పుచ్చుకు కొట్టు" అన్నాడు.

రంగయ్య నిట్టూర్చి చేతికర్ర తీసికొని వెనుదిరిగేడు.

రామం దీనంగా వెళ్ళిపోయే రంగయ్యని చూశాడు. అతని మనస్సు ఎవరో కెలకినటయింది.

అంతకుముందు రోజు సాయం సంధ్యలో చూసిన పార్వతిరూపం గుర్తుకొచ్చింది. ఆ కాలు కొంచెం అవిటి తప్పితే పార్వతికేమిటిలోటు? పోతపోసిన బంగారు విగ్రహంలాంటి పార్వతిముందు ఏ స్త్రీ నిలబడగలదు? తనమూలాన్నే కదా పార్వతి కుంటిదయింది. తన వైద్య విద్యనంతా ఉపయోగించి పార్వతిలోని అంగవైకల్యాన్ని పోగొట్టి, పార్వతిని సంపూర్ణ సౌందర్యమూర్తిగా చేయలేడా. పార్వతిని తన దానిగా చేసికొని పార్వతికి జరిగిన అన్యాయానికి ప్రతిఫలం ఇవ్వలేడా! తను. పార్వతికేమిలోటు? రూపమా? గుణమా? కులమా?

డబ్బు లేకపోతేమాత్రం? ఓనాడు పార్వతి తండ్రి ఆదుకోకపోతే తన తండ్రి స్థితి ఈనాడిల్లా ఉండేదా? పార్వతిని కోడలిగా చేసుకోనేటందుకు తన తల్లి పూర్తిగా సుముఖురాలు. ఇంక తండ్రి విషయం. తను పట్టుపడితే తండ్రికి కాదనేశక్తిలేదు.

రామం పరిపరివిధాల ఆలోచించాడు. సాయంకాలం నీరెండ లాతని మొహంపై పడ్డాయి.

రామం ఓ నిశ్చయాని కొచ్చినట్లు చిరునవ్వు నవ్వుకొన్నాడు. లేచి బట్టలు మార్చుకొని రంగయ్య యింటివైపుగా వెళ్ళేడు.

రంగయ్య మంచంపై నిస్పృహగా పరున్నాడు. పార్వతి బియ్యంలో బెడ్డలేరుతూ సావిట్లో కూర్చొని ఉంది. చెప్పుల చప్పుడు విని చప్పున తలెత్తి, రామాన్ని చూసి, చేట ప్రక్కన పడేసి లేచి "రా! రామం బావా!" అంది.

రంగయ్య మంచంమీదనుంచి "ఎవరమ్మా వారూ!" అన్నాడు.

"రామం నాన్నా! నిన్ను చూడ్డానికి వచ్చాడు" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రామం రంగయ్య కాళ్ళవైపు కూర్చొన్నాడు.

"ఏం బాబూ? పరీక్ష బాగా ఇచ్చావా!" అన్నాడు రంగయ్య వాత్సల్యంగా చూస్తూ.

"ఆ బాగానే అయింది" కొంచెం ఆగి, "సరే కాని మామయ్యా మరి పార్వతి పెళ్ళెప్పుడు?" అన్నాడు రామం.

రంగయ్య బాధగా "దాని పెళ్ళి ఈజన్మకయేలా లేదు. వీధిన బోయేవాడికి ఇద్దామన్నా వాడూ సంచులు తెమ్మనే వాడే! నాకా, రెక్కలుడిగి పోయేయి. ఏమిటో అంతా అయోమయంగా ఉంది. ఇంతకీ దేవుడిదయ ఎల్లా ఉందో!" అన్నాడు.

రామం ఇంక సంభాషణ పెంచడం ఇష్టంలేక "మామయ్యా! నిన్ను నూటిగా అడుగుతా! పార్వతిని వీధిలో వాడికిచ్చే బదులు నాకే ఇవ్వరాదా!" అన్నాడు.

రంగయ్య అతి కోపంతో..."ఏమిటి రామం! నీకు కూడ ఎగతాళేనా మేమంటే! నువ్వు పార్వతిని ఈ పరిస్థితుల్లో చేసుకొంటావా? ఎందుకు మమ్మల్ని అవమానపరచడం?" అని గట్టిగా అరిచాడు. పార్వతి రామంకోసం గిన్నెలో జున్ను తెచ్చేదల్లా తండ్రి కేకలకు తలుపు వద్దే నిలుచుండిపోయింది.

రామం రంగయ్యచేతులు పట్టుకొని "మామయ్యా! క్షమించు. నిన్ను అవమానపరుద్దామని నా ఉద్దేశం కాదు. మా మామ్మ, సూరమ్మత్తయ్య వియ్యమందాలనుకొనేవారు. అత్తయ్య వెళ్ళిపోయింది. మామ్మ వెళ్ళిపోయింది. వారిద్దరి కోర్కెలూ నే తీరుస్తాను. నన్నాశీర్వదించు మావయ్యా. ఎవరొద్దన్నా నేను పార్వతినితప్ప మరెవరినీ పెళ్ళాడను. పార్వతి కాలు నేనే పోగొట్టా. నేనే బాగు చేసుకొంటా. మావయ్యా నువ్వు కోపాలు, పట్టుదలలూ మాని మమ్మల్ని ఆశీర్వదించు మామయ్యా!" అంటూ రంగయ్య పాదాలపై తలపెట్టాడు రామం.

రంగయ్య కన్నీళ్ళు జలజలా రాల్తూండగా రామం తల హృదయాని కదుముకొని "రామం బాబూ! నాకు నిన్నాశీర్వదించడానికి మాటలు రావటంలేదు బాబూ! నా చిట్టితల్లిని నీచేతిలో పెట్టా యింక నీదేభారం" అని "అమ్మా! పార్వతీ" అని పిలిచాడు. పార్వతి వెంటనే దేముడి గదిలోకి వెళ్ళి దేవుని ముందు దీపం వెలిగించసాగింది. రామం "నేను పార్వతిని తీసుకొస్తానుండు మామయ్యా" అని దేముని గదిలోకి వెళ్ళేడు.

రామం నవ్వుతూ "పార్వతీ! నిన్న ఈ సమయానికే నిన్ను యింటివద్ద దింపుతానంటే" 'ఆమాత్రం దయఉంటే చాలు' అన్నావు. ఈమాత్రం దయ చాలా!" అన్నాడు.

పార్వతి కళ్ళనిండా నీళ్ళు నిండగా దేమునిపటం ముందు మోకరిల్లింది. రామం కూడా పార్వతి ప్రక్కనే మోకరిల్లాడు. ★